
# చిన్నకొడుకు



ఎవరైనా జీవితంలో ఒక్క పర్యాయమే ప్రేమించగలరు. ఆ ప్రేమ ఫలించనప్పుడు జీవితం నరకసదృశం అవుతుంది. జీవచ్ఛవాల్లా అంధకారంలో పయనించే ప్రాణులకు ఒక్క వెలుగు కిరణమైనా కనుపించక పోదు. అదే జీవితమంతా నిండి, సాఫల్యం లేక పోయినా, జీవన యానం సాధ్యమయ్యేటట్లు చేయగలుగుతుంది. ఇదీ ప్రాపంచిక సత్యమే !

"భాస్కర"

వేండమీద పడక గదిలో మంచంమీద కూర్చుని స్వెట్టర్ అల్లుతున్న కృష్ణకు, అకస్మాత్తుగా ఎవరో స్త్రీ ఆక్రందన ధ్వని వినిపించితే, అల్లుతున్న స్వెట్టర్ని మంచంమీద వదిలి కిటికీవద్దకు వచ్చి వీధిలోకి చూసింది. ఒక శవాన్ని నలుగురు మనుష్యులు తీసుకుపోతూ ఉన్నారు. ఓ యువతి గుండె పగిలేటట్లు ఏడుస్తూ కూడా వెళ్ళుతూ ఉంది. శవాన్ని చూస్తే యువకునిదిలా ఉంది.

ఆ దృశ్యం చూస్తూ కృష్ణ అట్టే నిల్చునిపోయింది. ఆమె కళ్ళముందు రవి, సావిత్రి మెదిలారు. ఆమె కళ్ళు బాధతో చెమర్చాయ్. కిటికీ చువ్వల్ని గట్టిగా పట్టుకొని పిచ్చిదానిలా శూన్యంలోకి చూస్తూంది. నాలుగేళ్ళ కొడుకు "చిరంజీవి" "అమ్మా! అమ్మా!!" అంటూ ఆమె చీరకుచ్చెళ్ళు లాగుతూంటే, కృష్ణ ఈ లోకంలోకి వచ్చి కొడుకును ఎత్తుకొని హృదయానికి హత్తుకుంది గాఢంగా.

• • •

కృష్ణ తండ్రి సుందరరామయ్య కూతుర్ని కాలేజీలో చేర్పుటకు కాకినాడకు తీసికొని వచ్చాడు. కూతుర్ని హాస్టల్‌లో ఉంచడానికి ఇష్టంలేక, తన చిన్ననాటి స్నేహితుడైన డాక్టర్ వాసుమూర్తిగారింట్లో ఉంచాడు.

క్రొత్తలో కృష్ణకు అదోలా ఉండేది వాసుమూర్తిగారింట్లో. కానీ, వాళ్ళు చూపే వాత్సల్యం, ప్రేమవల్ల కొద్ది రోజులలోనే వాళ్ళలో కలిసిపోయి, ఆ ఇంట్లో ఒకామెగా అయిపోయింది కృష్ణ. తనూ, సావిత్రీ—అంటే వాసుమూర్తిగారి ఏకైక పుత్రిక—ఒకే క్లాసు, ఒకే గ్రూపు. రోజూ ఇద్దరూ కలిసి కాలేజీకి వెళ్ళేవారు, వచ్చేవారు. ప్రతి సాయంత్రం వాళ్ళ పెరటిలో కొబ్బరిచెట్టు ప్రక్కఉన్న సిమెంటు సోఫాలో కూర్చుని, కాలేజీలో ఆ రోజు జరిగిన సంఘటనలను తలచుకొని నవ్వుకునేవారు, వాదించుకునేవారు.

సోమవారం. కృష్ణ కాలేజీకి తయారై మరొక్కసారి నైలాన్ రిబ్బన్‌లతో వేసుకొన్న రెండు జడలను అద్దంలో చూసుకొని, తనకు తానే మురిసిపోయి, పుస్తకాలు తీసుకొని సావిత్రి గదిలోకి వెళ్ళింది. సావిత్రి ఓ యువకునితో మాట్లాడుతూంది. అతను సావిత్రి మంచంమీద కూర్చొని ఉన్నాడు. సావిత్రి ప్రక్కనే ఉన్న బల్లపై అనుకొని అతనితో నవ్వుతూ మాట్లాడుతూంది. కృష్ణ గిరుక్కున తిరిగిపోయింది.

సావిత్రి చూచింది.

"ఓ—కృష్ణా! పోకు—మాట" అంటూ గుమ్మంవద్దకు పరుగెత్తి కృష్ణను పిలిచింది.

ఆమె రానంటున్నా బలవంతంగా గదిలోకి తీసుకొని వెళ్ళింది. సావిత్రి వెనుకనుండి ఓర చూపులతో నెమ్మదిగా వస్తున్న కృష్ణవైపు రెప్ప వాల్చకుండా చూస్తూ ఉండిపోయాడు—అతడు.

సావిత్రి గబగబా ముందుకు వచ్చి అంది: "రవి బాబూ! ఈమె మా బంధువుల అమ్మాయి—పేరు కృష్ణ! ఇద్దరం ఒకే క్లాస్" అని పరిచయం చేసింది.

రవి రెండు చేతులు జోడించి "నమస్కారమండీ" అన్నాడు నవ్వుతూ మెల్లగా.

కృష్ణ సిగ్గు దాచుకుంటూ "నమస్కారమండీ" అంది నెమ్మదిగా.

"కృష్ణా! ఈయన పేరు రవి. ఇక్కడే కస్టమ్సులో పని చేస్తున్నారు" అంది సావిత్రి.

ఇంతలో గడియారం "టంగ్" మని అరగంట కొట్టింది. సావిత్రి ఉలిక్కిపడి రవికేసి చూసి "రవి బాబూ! మాకు టైం అవుతుంది" అంది.

"సరే—నాకూ పనుంది—మళ్ళీ రేపు వస్తా" అంటూ లేచాడు కృష్ణకేసి చూస్తూ అతడు.

కృష్ణ తన శాంత ప్రసన్నములైన చూపుల్ని బలవంతంగా రవివైపునుండి క్రిందకు మరల్చింది.

వాళ్ళతోపాటు కాంపౌండ్ గేటువరకు వచ్చి మళ్ళీ వాళ్ళతో చెప్పి సైకిల్ ఎక్కుతున్న రవిని చూచి సావిత్రి "రవి బాబూ!" అని పిలిచింది.

రవి దగ్గరకు రాగానే "రవి బాబూ! సాయంత్రం త్వరగా రారాదూ? మంచి పిక్చరుంది" అంది.

"సరే—అట్లాగే" అన్నాడు రవి.

రిక్షాలో కృష్ణప్రక్క సావిత్రి కూర్చోగానే "ఎవరే—ఆయన—సావిత్రీ" అంది కృష్ణ.

"ఎవరి సంగతి—రవిబాబా? ఆయన మొదట మా నాన్నగారి స్నేహితుడు. మంచి టెన్నిస్ ఆటగాడు. అందువల్లనే క్లబ్‌లో మా నాన్నగారికి రవిబాబుకు పరిచయమయింది. తరచూ మా యింటికి వచ్చేవాడు. మా అమ్మను "అమ్మా" అని పిలుస్తాడు. మా అమ్మకు మగపిల్లలు లేని కారణంచేత ఆయన "అమ్మా" అని పిలవగానే అమ్మ ఎంత పొంగి

పోతుందనుకొన్నావ్. అమ్మ అంటుంది నాన్నతో—"రవి నా మొదటి కొడుకు. తర్వాత సావిత్రి" అని అంది నవ్వుతూ.

"మనింటిలోనే ఉంటారా, ఆయన? మరి ఇంతకాలం ఎక్కడకు వెళ్ళారు" అంది కృష్ణ.

"ఎంత బ్రతిమాలినా ఉండలేదు. ఎక్కడో లాడ్జిలో ఉంటున్నాడు. ఊళ్ళో ఉన్నంతకాలం రోజూ ఇంటికి వస్తాడు. మొన్న క్యాంప్ వెళ్ళా డనుకొంటా. అందుకే ఇంతకాలం కవబడలేదు" అంది సావిత్రి జారిపోతున్న పుస్తకాలు సర్దుకుంటూ.

"వారిది ఏవూరు?"

"ఏం—కొంపతీసి ప్రేమిస్తున్నావా?—ఏంటి" అంది నవ్వుతూ సావిత్రి.

"పోదూ"

"అదేదో నీ కళ్ళే చెప్పుతున్నాయిలే" అని మళ్ళీ అంది.

అవునుకృష్ణా! వారి వూరడిగివా— వారి కుటుంబం గురించి అడిగినా చెప్పడు. ఏవో గొడవలు జరిగాయి అనుకొంటూ, వచ్చివేశాడు. కానీ, ఒక్కటి మాత్రం నిజం" అంది కృష్ణ కేసి చూసి.

కృష్ణ అతురతతో చూస్తోంది.

"అతనింకా పెళ్ళి మాత్రం కాలే" దండి కృష్ణకేసి చూసి కొంటెగా నవ్వుతూ సావిత్రి.

కృష్ణ కృత్రిమ కోపంతో బుంగమూతిపెట్టి సావిత్రి ముఖాన్ని అటు ప్రక్కకు త్రోసివేసింది. రిక్షా డి. యం. ఓ. బంగళాను దాటి కాలేజీ ఆవరణలో ప్రవేశించింది.

* * *

సినిమానుండి వచ్చిన తరువాత పక్కమీద పడుకొని నిద్రకొరకు ప్రయత్నించింది కృష్ణ. కానీ, ఆమెకు నిద్ర వస్తేగా! కృష్ణ మనస్సు రవిపైకి పోయింది. "ఏమిటి అతని ప్రవర్తన. అతను నిజంగా చేయాలని చేశాడా? లేక



ఆంధ్ర ప్రభ
సచిత్ర వారపత్రిక
తప్పక చదవండి !

మీరు చదవాలి
జీవిత రహస్యాలు:- మీ దాంపత్యసుఖానికి అనేక కామ సూత్రాలు:-...... రూ 3-50
యువతి:- స్త్రీలను గురించి అనేక కుతూహల విషయాలు......... రూ. 3-50.
సంతానము:- గర్భనిరోధానికి 60 నవీన సులభ మార్గాలు............. రూ. 3-50
పోష్టు ఖర్చులు చితం. క్రింది ఎడ్రస్సుకు వ్రాస్తే వి. పి. పోష్టు ద్వారా మీయింటికి పంప బడును.
దేశసేవ ప్రచురణలు, ఏలూరు, (ఆంధ్ర)

మీ అందానికి

గ్లోరియా అనేసౌందర్యపోషక ద్రవం, ముదిరూపును పోగొట్టి మీ ముఖానికి, చక్కని లేతదనాన్ని కాంతిని తెచ్చును. మొటిమలు, మచ్చలు, ముడుతలు, ఎండకువచ్చిననలుపును పోగొట్టి, ముఖాన్ని తెలుపుచేసి మీఅందాన్ని రోజు రోజుకీ ఎక్కువ చేయును. మొదటి పూతలోనే కొంత అందము వచ్చును. వాడిచూస్తే విడువరు. అన్నిషాపులలోను దొరకును.
జనితా ప్రొడక్ట్సు, ఏలూరు, (ఆంధ్ర)



రామ్సన్ పెన్ కంపెని
బడీచావడి : హైదరాబాదు

# చిన్న కొడుకు

కేవలం పొరపాటువల్లనా. ఏమో! తనకు అది పొరపాటుగా తోచటంలేదు. తను ఊహించింది నిజమా! తన్ను ప్రేమిస్తున్నాడా! పాపం—సావిత్రి. అతన్ని ఎంతగా అభిమానిస్తోంది. అందుకు ప్రతిఫలం అతను ఇస్తున్నది ఇదా! ఈ విషయం సావిత్రికి తెలిస్తే ఆమె హృదయం ఎంత బాధపడుతుందో స్త్రీ అయిన తనకు తెలియదా ? ఛీ ఈ మగాళ్లు అంతా ఇంతే. వట్టి తుమ్మెదలు.

"తన హృదయం—అతనికొరకు ఎంత ఆరాట పడుతూంది. కానీ—తను సావిత్రికి ద్రోహం చేయాలా? చేయగలదా? ఇదా, ఆమె చూపుతున్న ఆదరణకు ప్రతిఫలం? ఇక మీదట అతనికి తను చాలా దూరంగా మెలగాలి. అతని నీడకు తను పోకూడదు" అనుకుంది. బరువుగా నిట్టూర్పు విడిచింది. కానీ—మమతతో కూడిన అతని చూపులను తను మరిచిపోలేదు. కళ్ళు గట్టిగా మూసుకుంది. రవి రెండు చేతులు చాచి దీనంగా పిలుస్తున్నట్లు కన్పించింది కృష్ణకు. వెంటనే కళ్ళు తెరిచింది. ఆమె హృదయం ఘోష పెడుతూంది అతనికొరకు.

"నాన్నా! నన్నెందుకు ఇక్కడ ఉంచావు? నే నిక్కడకు రాకపోతే నాకీ బాధ ఉండదుగా" అనుకుంది కన్నీళ్ళు పెట్టుకుంటూ.

..........................

"ఏం కృష్ణా! నిద్రలో నవ్వుతున్నావ్—ఏమిటి ఇంతవరకు నిద్రపోతున్నావ్? త్వరగా లే" అంటూ సావిత్రి లేపేవరకు కృష్ణకు మెలకువ రాలేదు.

కృష్ణ ఉలిక్కిపడి లేచింది.

"ఏమిటి ఈ మొద్దు నిద్ర?"

కృష్ణ మాట్లాడలేదు. ఇంకా మంచం మీదనే కూర్చుని ఉంది.

"త్వరగా లే—వేణు ఇంటికి వెళ్ళాలి. అదీ, వాళ్ళమ్మ ఎప్పట్నించో రమ్మంటున్నారు" అంది సావిత్రి కృష్ణ భుజంతట్టి.

కృష్ణ తల పట్టుకొని "తల నొప్పిగా ఉందే—" అని టైము చూచి, "అబ్బ! అప్పుడే 8—30 అయిందే—మరి కాలేజీ—ఓ—ఈవాళ సెలవుగా" అని సావిత్రికేసి చూసి మళ్ళీ—"తల నొప్పిగా ఉంది—నేను రాలేను—నీవూ అమ్మ పోకూడదూ" అంది బ్రతిమాలుతూ.

"ఏం. ఎందుకు తలనొప్పి? రాత్రి నిద్ర లేదేమిటి అమ్మాయిగారికి? నాకు తెలుసులే, రాత్రి నీకు నిద్ర రాలేదు కదూ" అంది నవ్వుతూ సావిత్రి.

కృష్ణ మాట్లాడలేదు. అదోలా చూస్తూ ఊరుకుంది.

"ఏమిటే కృష్ణా! నిద్రలో నవ్వుతున్నావ్. ఉదయం వచ్చిన కలలు నిజమవుతాయిలే" నవ్వుతూ అంది సావిత్రి.

"నిద్రలో నవ్వుతున్నానా?"

"ఆ "

"లేదే?"

"పోనీ! దాచుకో—చెప్పకపోతే."

"ఇది—మరీ బాగుంది. కారణం లేకపోతే—ఏం చెప్పను ?"

"సర్లే—అయితే అమ్మా నేనూ మరి వెళ్తాం" అంటూ సావిత్రి వెళ్ళిపోయింది.

* * * *

కిటికీలో కూర్చునిఉన్న కృష్ణ వద్దకు సావిత్రి నెమ్మదిగా వచ్చింది. చేతిలోని జాకెట్ గుడ్డలను బల్లమీద పెట్టి "తల నొప్పి తగ్గిందా" అంది కృష్ణను చూస్తూ. కృష్ణ మాట్లాడలేదు.

"నీవు రాలేదని ఎంత బాధ పడిందనుకొన్నావ్—కృష్ణా!—ఇదిగో వీటిని కట్ చెయ్యమంది" అంది సావిత్రి జాకెట్ పీసెస్‌ను చూపిస్తూ.

ఇప్పుడు కూడా మాట్లాడలేదు కృష్ణ.

సావిత్రి అంది ఆశ్చర్యంతో "ఏమిటే కృష్ణా! ఏమైంది" అని.

కృష్ణ గభాలున సావిత్రిమీద వాలి బావురుమంది. సావిత్రి బిత్తరైపోయింది. వెక్కి వెక్కి ఏడుస్తున్న కృష్ణను దగ్గరగా తీసుకుంటూ "ఏం జరిగింది కృష్ణా! చెప్పు" అంది సావిత్రి.

కృష్ణ కొంత తమాయించుకొని నెమ్మదిగా వెళ్ళి తన తలగడ క్రిందఉన్న ఉత్తరాన్ని సావిత్రికి ఇచ్చి మంచంపై వాలిపోయింది. సావిత్రి గాభరా పడుతూ ఆ ఉత్తరాన్ని విప్పింది. అది కృష్ణకు రవి వ్రాసిన ప్రేమలేఖ. సావిత్రి నవ్వుతూ కృష్ణ ప్రక్కన కూర్చుంది.

"ఇందుకా కృష్ణా! ఈ బాధ? రవిబాబుతో చెప్తానులే. ఇంకెప్పుడూ ఇట్లా వ్రాయవద్దని" అని కొంతసేపు ఆలోచించి మళ్ళీ అంది: "అతను చాలా మంచివాడు. మరెందుకు ఈలా చేశాడో తెలియదు"

"ఏం. కృష్ణా అతనిలో లోపం ఏముంది? మనసారా నిన్ను ప్రేమిస్తున్నాడు. మూర్ఖత్వం కాదుకదా!" అంది సావిత్రి మళ్ళీ. కృష్ణ గభాలున తల పైకెత్తి సావిత్రికేసి చూసింది. ప్రశాంతముగా ఉన్న సావిత్రి ముఖాన్ని చూచి ఆశ్చర్యపోయింది కృష్ణ.

"అవును కృష్ణా! లోప మేమిటి అతనిలో. అందమైనవాడు. విద్యాంసుడు—ఇంతకన్న మరేం †



బేలూరులోని శ్రీ రామకృష్ణ మఠం    ఫోటో—ఎన్. వి. ఆర్. స్వామి (మద్రాసు)

కావాలి నీకు?"

"ఏమిటి సావిత్రీ నీ వంటున్నది? నాకు అర్థం కావటంలేదు" అంది బొంగురుపోయిన కంఠంతో కృష్ణ.

"నేను మాట్లాడేది తెలుగు. మరేం ఇతర భాష కాదు"

"నీవు ఆయన్ను ప్రేమించటం లేదా!"

"ఓహో! అదా నీ బాధ కృష్ణా! ఎంత మోసపోయావు? అంత అదృష్టం నాకు లేదు కృష్ణా—కానీ, ఒకందుకు నేను అదృష్టవంతురాల్ని. నాకూ ఒక మంచి అన్నయ్య ఉన్నాడనే గర్వం నాకుంది."

"సావిత్రీ" అంటూ సావిత్రిమీద వాలిపోయింది కృష్ణ.

• • •

వర్షం కురిసి వెలిసినట్లు ఆ గది అంతా నిశ్శబ్ద వాతావరణంతో నిండిఉంది. అంతకు పూర్వం కృష్ణ పుట్టిన రోజువల్లనూ, ఆ సందర్భంలో జరిగిన పార్టీవల్లనూ కోలాహలంగా ఉంది. జట్లు జట్లుగా స్నేహితులు వెళ్లిపోయారు. రాత్రి 9—30 అయింది. చంద్రుడు నెమ్మదిగాపైకి వస్తూన్నాడు. కిటికీలో కూర్చుని కృష్ణ దిగులుగా ఉంది. ఆమె కళ్ళు వేదనతో నిండి ఉన్నాయ్. ఆత్రుత, చాంచల్యం వాటిలో కనబడుతున్నాయ్. తలస్నానం చేసిందేమో వదులుగా అల్లుకొన్న జడలు ఆ వెన్నెలలో ఆమెకు మరింత అందాన్నిస్తున్నాయ్. సావిత్రి వచ్చిన బహుమతుల పట్టిక తయారుచేసి కిటికీవద్దకు వచ్చింది.

"కృష్ణా!" అంది భుజం తట్టి.

కృష్ణ మాట్లాడలేదు. ముఖాన్ని అటు ప్రక్కకు త్రిప్పుకొంది.

"ఏడుస్తున్నావా! ఎందుకు అంత బాధ" అని మళ్ళీ—"నిజం సుమా! మనం కాంక్షించినది నెరవేరకపోతే బాధగా ఉంటుంది" అంది.

కృష్ణ ఇప్పుడు కూడ మాట్లాడలేదు.

"ఏదో ముఖ్యమైన పనులవల్ల రాలేకపోయి ఉంటాడు. ఇంత బేలవైతే ఎట్లా!"

ఆమె ఓదార్చుతున్నకొలదీ కృష్ణకు ఇంకా దుఃఖం ముంచుకొస్తూంది. ఇంతలో 'టక్', 'టక్' మంటూ శబ్దం చేస్తూ వచ్చాడు రవి.

సావిత్రి గిరుక్కున తిరిగి "అమ్మ! వచ్చావా? రవిబాబూ—ఓదార్పలేక చస్తున్నా" అంది కృష్ణను చూపిస్తూ.

తర్వాత కృష్ణవద్దకు వచ్చి "ఇక నీకసి అంతా తీర్చుకోవే" అంది నవ్వుతూ.

"ఏం సావిత్రీ! నాపై మహాకోపంలో ఉన్నారేమిటి మహారాణివారు" అంటూ రవి అక్కడ ఉన్న మంచంమీద కూర్చుంటూ అన్నాడు.

"ఏడుస్తూంది" అన్నట్లు సైగచేసి వెళ్ళిపోయింది సావిత్రి.

రవి నాలుక కరచుకొని కృష్ణవైపు చూశాడు. కృష్ణ కిటికీలోంచి చూస్తూంది. ఆకాశం నిర్మలంగా ఉంది. సిమెంటు సోఫా వద్దఉన్న కొబ్బరి చెట్టు ఆకులు చంద్రునితో ఆడుకొంటున్నాయ్.

రవి లేచి కిటికీవద్దకు వచ్చి "కృష్ణా కోపం వచ్చిందా?" అన్నాడు ఆమె చేయిని తన చేతిలోకి తీసుకొంటూ. కృష్ణ మాట్లాడలేదు.

"క్షమించు కృష్ణా! తొందర పనివల్ల వేళకు రాలేకపోయా. మరొక్కసారి మీ ఫ్రెండ్సుకు పరిచయం చేద్దువుగానిలే" అన్నాడు రవి మృదువుగా ఆమెను తనవైపు త్రిప్పుకుంటూ.

కృష్ణ అతనివైపు బరువుగా చూసింది.

"ఛీ! ఛీ!!—ఎవరన్నా పుట్టిన రోజున ఏడుస్తారా?" అని ఆమె కన్నీళ్ళు తుడిచి లాగు జేబీలోంచి సన్నని బంగారం గొలుసు తీసి "ఇదిగో కృష్ణా! నా ఈ చిన్న కానుక" అంటూ ఆమె మెడలో వేశాడు రవి.

"టివి ఎన్నుకొనడంలో కూడా కొంత ఆలస్యమైంది మరి" అన్నాడు మళ్ళీ బ్రతిమాలుతున్నట్లు.

అంతే—ఆమె మురిసిపోయింది. రవి ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. ఆమెను సిగ్గు ముంచివేసింది.

సావిత్రి చకచకా అక్కడకు వచ్చి "రవి బాబూ! అమ్మ తొందర చేస్తూంది భోజనానికి..............అమ్మ! ఎంత అందంగా ఉంది గొలుసు. అబ్బ! ఇప్పుడు నవ్వుతుందే—నా తల్లి—ఎంత గాభరా పెట్టింది నన్ను" అంది నవ్వుతూ ముందుకు వచ్చి గొలుసు చూస్తూ.

## చిన్న కొడుకు

"పోవే" అంది కృష్ణ రవి వెనక్కుపోతూ.

"దాచుకో తల్లీ" అంది సావిత్రి. ముగ్గురూ నవ్వుకుంటూ గది విడిచారు.

• • •

కృష్ణ రవికి ఎదురుగా కూర్చుని తెల్లని ఇసుకలో ఏవో బొమ్మలు గీస్తూంది. ఎవరో కళాకారుడు వీణ తంత్రులను మనోరంజకంగా మీటుతున్నాడు. చల్లని మలయమారుతం మెల్లగా మైమరపించేటట్లు వీస్తూంది. ఆమె ముంగురులు నొసటిమీద పడి నాట్యం చేస్తూంటే, ఆమె ముంజేతితో వాటిని వెనక్కు నెట్టుకొంటూంది. రవి చూస్తూ ఆనందిస్తున్నాడు.

ఉండుండి "కృష్ణా!" అని పిలిచాడు.

"ఊ" అంది ముఖమెత్తి రవి కళ్ళలోకి చూస్తూ. దేన్నో ఒక్కసారి అమాంతంగా పట్టుకుందాం—అన్నట్లుగా ఉంది అతని భంగిమ.

ఆమె నవ్వింది చిన్నగా.

రవి అన్నాడు తన చూపులను ఆమె చూపులతో కలుపుతూ: "నవ్వడం కాదు! మీ పరీక్షలు అయిపోయాయి. రెండు రోజులలో నీవు వెళ్ళిపోతా వనుకొంటా—మన సంగతి ఏం చేశావు?"

ఆమె నవ్వుతూ అంది: "అంతా సావిత్రి అప్పుడే ఏర్పాటు చేసింది" అని.

"ఏర్పాటా! అదేంటి" అన్నాడు రవి ఆశ్చర్యంతో.

"అవునండీ! మా రిజల్టు్స వచ్చాక సావిత్రి మన విషయం వాళ్ళ నాన్నగారితో చెప్పి ఆయనతోసహా మిమ్మల్ని మా ఇంటికి తీసుకొని వస్తుంది. ఇద్దరూ చిన్ననాటి స్నేహితులు. వారి మాటను మా నాన్నగారు త్రోసి వెయ్యరు. పెద్దల సమక్షములోనే మన పెళ్ళి ఏర్పాటు జరుగుతుంది. మీరు మరేం బాధ పడకండి" అంది కృష్ణ.

"అయితే మీ రిజల్టు్స మనకు అడ్డా?"

"అవును మరి. నేను తప్పకుండా పాస్ అవుతాను. నేను పాస్ అయ్యానన్న సంతోషంలో మా నాన్నగారు మనకు మరీ అనుకూలంగా ఉంటారుగా" అంది కొంచెం దూరంలో చేప పిల్లలను పట్టడానికి అవస్థ పడుతున్న పిల్లలను చూస్తూ. రవీ అటే చూస్తున్నాడు.

ఉన్నట్లుండి కృష్ణ అంది: "మీరు ఎందువల్లనండి ఇల్లు వదిలారు? ఆ విషయాలు ఎవ్వరితో చెప్పరటగా? సావిత్రి అంది. నాతో చెప్పకూడదా?" అని.

"అవును కృష్ణా! నేనింతవరకు ఎవ్వరితో చెప్పలేదు. అది నా కిష్టంలేదు" అన్నాడు ముఖాన్ని ప్రక్కకు త్రిప్పి.

"ఎందువల్ల? పోనీ, ఇతరులతో చెప్పక పోవచ్చు. నాతో చెప్పవచ్చుగా" అంది ఆశగా.

రవి మాట్లాడలేదు.

"చెప్పరూ?"

"పెద్ద విశేషం కాదు కృష్ణా! నా మనసుకు కష్టంతోచింది. అంతే వచ్చివేశాను" అన్నాడు ఆమెవైపు చూస్తూ.

రవి కళ్ళలోకి చూస్తూంది కృష్ణ.

"నేను బి. ఏ. పాసు అయినతర్వాత విశాఖపట్టణంలో బి. ఇ. చదువుతానన్నాను. అమ్మ, అన్నయ్య డబ్బులేదన్నారు. మాకు ఆరు ఎకరాల పొలం ఉంది. అందులో కొంత


## మలబద్ధము - మూలవ్యాధి

నిత్య మలబద్ధము మూలవ్యాధిని లేక రక్తమూలమును కలుగజేయును. దీనివలన మూలములోపల, దాని చుట్టూ ఉండే శిరలు వాచిపోవును. నొప్పిగా ఉండుటచే మల విసర్జనము, ఎక్కువ ప్రయాసము కష్టముతో కూడియుండును. మలబద్ధము మరింత ఎక్కువౌతుంది. దాంతోపాటు మూలవ్యాధి ముదిరి భరింపరాని నొప్పితో పగుళ్ళు ఏర్పడతాయి. కాబట్టి మూలవ్యాధి వల్ల కల్గే తీవ్రమైన బాధ, కష్టము నివర్తి అయితే మలవిసర్జనం సునాయాసం ఔతుంది. హెడంజా చేసే పనే ఇది. ఇది వెంటనే నొప్పిని, దురదను నివారించును. విడవకుండా వాడితే మూలము పూర్తిగా ముడుచుకొనిపోయి శంకకుదిరి పోవును. ప్రసిద్ధి చెందిన జర్మన్ తయారీ మూల వ్యాధి నివారిణి. హెడంజాలో తిమ్మి రేక్కునట్లు చేయుగల మందులేవీ లేవు. మరియు వస్త్రిములను ఖరాబు చేయదు. ఉపయోగము అతి సులభము. ప్రతి ప్యాకెట్‌లోను ఉపయోగ విధానపు సూచనలు ఒకప్లాస్టిక్ గొట్టంతోసహా సప్లయి చేయబడును. మీ మూలవ్యాధి సమస్యకు ఉత్తరము హెడంజా నేడే హెడంజాను వాడండి. ఇప్పుడు హెడంజా ఇండియాలో తయారవుతుంది.

D Z 952-A





## పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, ఆకస్మాత్తు ద్రవ్య లాభము మొదలగు వానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్ట గ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (AV-3) Jullundur City.**

అమ్మమ్మా. అన్నయ్య అగ్గిలా లేచాడు. 'ఇది తరతరాలనుండి వస్తున్న భూమిరా. దీన్ని అమ్మేందుకు ఎవరికీ అధికారం లేదు.' అన్నాడు అన్నయ్య. అమ్మకూడా అంతే అంది. అన్నయ్య తన చదువుకై ఎంతో డబ్బు ఖర్చు చేసుకొన్నాడు. నే నడిగితే డబ్బు లేదంటాడు. నిజంగా అప్పుడు ఉందో లేదో నాకు తెలియదు. కానీ ఎక్కడన్నా తేవచ్చుగా. నాకు కోపం వచ్చింది. పొలంలో నా వాటా నా కిమ్మన్నాను. 'నీకీబుద్ధులు ఎట్లావచ్చాయో నాకు తెలియటం లేదురా. పొలాన్ని అమ్మేది లేదు. దాన్ని ముక్కలుగా చేసేదిలేదు. అమ్మ ఉండగా దాన్ని ముక్కలుగా చెయ్యను' అన్నాడు అన్నయ్య. మా అమ్మ ఏడుపు మొదలుపెట్టింది. మళ్ళీ మా అన్నయ్య అన్నాడు: 'అంతగా నీకు చదవాలని ఉంటే — మూడు నాలుగు సంవత్సరాలు వేచిఉండు. నేను చదివిస్తాను అని''.

కృష్ణకేసి చూసి అన్నాడు కసిగా—
''అంతగా చదవాలని ఉంటేనట — అతను చదివిస్తాడట—దయతలచి. అంతే కృష్ణా! ఆ రాత్రే కనవడ్డ నా వస్తువన్న దాన్నల్లా తీసుకొని ఇల్లు వదిలి వచ్చివేశాను. నాను మూర్తిగారి దయవల్ల ఈ ఉద్యోగంలో ప్రవేశించా'' నిట్టూర్పు విడిచాడు రవి.

''మళ్ళీ మీరు ఇంటికి పోలేదా?''

''లేదు. ఇక నాకు ఆ ఇంటితో సంబంధం లేదు.''

''కానీ—రవిబాబు! తల్లి—కన్నతల్లి. ఎంత బాధ పడుతుందో ఆలోచించారా'' అంది కృష్ణ జాలిగా.

''కావచ్చు. నాకు అన్యాయం జరుగుతుంటే కూడా ఆమె మాట్లాడలేదు. కిమ్మన కుండా ఉంది'' అన్నాడు ఆవేశంగా.

కృష్ణ ఇంక అతన్ని ఆవేశపరచకూడ దనుకొంది. మాట్లాడకుండా కూర్చుంది.

''ఇదిగో సావిత్రి వచ్చింది. మరి నేను వెళతాను'' అంది కృష్ణ. దూరంగా రిక్షాలో కూర్చునిఉన్న సావిత్రిని చూస్తూ రవి లేచాడు.

''కృష్ణా! నేను బహుశా నీవు వెళ్ళేరోజున ఇక్కడ ఉండను. క్యాంప్ వెళ్ళాలి. ఇదే మన ఆఖరి కలియిక ఏమో? మళ్ళీ నిన్నెప్పుడు చూస్తానో'' అన్నాడు.

''ఛీ! అవేం మాటలండీ! మీరు మరేం బాధ పడకండి. ఇంటికి వెళ్ళాక ఉత్తరం వ్రాస్తాగా'' అని చెప్పి వెనుదిరిగి చూస్తూ, బరువుగా అడుగులు వేస్తూ వెళ్ళి రిక్షాలో సావిత్రి ప్రక్క కూర్చుంది కృష్ణ.

రవి మళ్ళీ అక్కడే కూర్చుండిపోయాడు. రిక్షా కదిలిపోయింది.

• • •

పరీక్షలై నెల గడిచింది. ''రిజల్ట్సు ఎట్లా ఉంటాయో'' అని సావిత్రి కిటికీ దగ్గరగా నించుని ఆలోచిస్తూంది. కృష్ణ తప్పకుండా పాస్ అవుతుంది. తనో—చెప్పలేదు. సావిత్రి మనస్సు కృష్ణపైకి పోయింది. చక్కగా చెల్లితో కబుర్లు చెప్పుకుంటూ గడుపుతుంది ఈ నాలుగు రోజులు. తర్వాత పెళ్ళి. అబ్బ! అనుకొంది సావిత్రి.

ఇంటికి వెళ్ళి రెండు మూడు ఉత్తరాలు మహావేగంగా వ్రాసిందే. తన రిజల్ట్సుకొరకు ఎంతో ఆత్రపడుతున్నట్లు ప్రతీ ఉత్తరంలో వ్రాసేది. కానీ, మళ్ళీ ఆమె వద్దనుండి ఉత్తరాలు లేవు. కారణం ఎంత ఆలోచించినా బోధపడలేదు సావిత్రికి. ''రవికన్నా వ్రాస్తూందా? రవిబాబును కనుక్కోవాలి'' అనుకొంది సావిత్రి.

''ఉన్నట్టుండి ఒక్కసారి పెద్ద చప్పుడైంది. సావిత్రి ఉలిక్కిపడి చూసింది. ఎండిన కొబ్బరిమట్ట సిమెంటు సోఫాపై పడింది.

అవును. ఆ సోఫాపై కూర్చుని తనూ, కృష్ణా, రవీ ఎన్నో వెన్నెల రాత్రులు, సాయం సంధ్యలు కబుర్లతో గడిపేవారు. వాళ్ళ కబుర్లు వంటింట్లోంచి రేలంగి మీదుగా రాకెట్టు ప్రయోగాలవరకు పోయేవి. నవ్వుకునేవారు. వాదించుకొనేవారు. తనూ, రవీ ఒకప్పై కృష్ణతో వాదనకు దిగేవారు. ''అబ్బ! ఎంత ధాటిగా వాదించేది'' అనుకుంది సావిత్రి.

''అమ్మాయీ! సావిత్రీ—నీకు ఉత్తరం వచ్చిందే'' అంటూ తల్లి అక్కడికి వచ్చి కవరు సావిత్రికి ఇచ్చింది.

సావిత్రి అందుకుంది ఆనందంతో. అది కృష్ణ వ్రాసిన కవరు.

దానిలో ఉన్న దిది:—

''సావిత్రీ!

చాలా రోజులకు నీకు వ్రాస్తున్నాను. నీవు అనుకుంటావు నేను నిన్ను మరిచిపోయానని. సావిత్రీ! నా పరిస్థితి ఎట్లా ఉందో నీకు తెలియదు. నేను ఎన్నడూ వూహించని ఒక విషమ సమస్య నాకు ఇప్పుడు ఎదురైంది. లోకంలో అందరూ అదృష్టవంతులు ఉండరుగా? ఉన్నా బహు తక్కువ. కానీ, దురదృష్టవంతులు ఎక్కడ చూచినా కనిపించుతారు. వాళ్ళతో నేనుకూడ కలిసిపోయే సమయం వచ్చింది.

ఎన్ని కలలు కన్నా; ఏమేమో వూహించుకొని చిత్రించుకొన్నా. కానీ, ఏం లాభం? జీవితంలో కాంక్షించిన మాధుర్యం—సౌరభం నాకు దక్కే యోగం కనిపించటం లేదు....''

సావిత్రి కృష్ణ వ్రాసిన ధోరణి చూసి భయపడింది. చేతులు వణుకుతున్నాయ్. గబగబా చదవ సాగింది.

''.....నేను ఇక్కడకు వచ్చిన రెండు మూడు వారాల తర్వాత నాన్నగారు ఎవరో

సినిమా నటులు

మీరు సినీకారులుగారిచే, నెలకు మంచివరుమానం పొందవలెనన్నచో నేడే మాకు వ్రాయండి ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషు లేక హిందీలో వ్రాయవలెను

BOMBAY FILM SERVICE
(W.A.P.) Phagwara (N.R.)

స్థాపితం 1920
రెడ్డి అండ్ కో. (రిజిష్టర్డు)
గోపాలపురం తూ. గో. జిల్లా
కుష్ఠు బొల్లి మేహపాద వగైరా చర్మ సుఖ వ్యాధులకు శాస్త్రీయ ప్రత్యేక చికిత్స.
ఆయుర్వేద ఔషధములు లభించును
→ కేటలాగు సలహా ఉచితము




దొంగల బారినుండి, అడవి జంతువులనుండి మిమ్ము మీరే కాపాడుకోండి. యాత్రీకులకు, వనభోజనాలకు, గ్రామాలకు ఉపయోగకరం. తేలికైన 6 గుండ్ల ఆటోమేటిక్ రివాల్వరు. దాని రవ్వలు కన్నులకు మిరుమిట్లు గొల్పును.

778 889 1001
రు. 6/50 రు. 8/50 రు. 13/50
25 తోటాలు ఉచితం
అదనంగా 100 తోటాలు రు. 5—తోలు సంచి రు. 6—లైసెన్సు అవసరంలేదు
పోస్టేజి రు. 2—అదనం

INDIAN CHAMBER OF SCIENCE,
(P.-APW) Julhundur City.


దిన దినానికీ
చర్మసౌందర్యం అతి మనోహరం
అది కొత్త రెక్సోనా చమత్కారం
ప్రాయ రెక్సోనా వాడుటవల్ల మీ చర్మానికి దివ్యమైన సొగసు కలుగుతూ వుంటుంది. దాని మీగడవంటి నురగలో 'కేడిల్' ... సొగసునొసంగే నూనెల ప్రత్యేక మిశ్రమం వున్నది. అది మీ చర్మములోకి చొచ్చుకుపోయి, దానిని మృదువుగాను, నునుపుగాను ... సొగసుగాను వుంచుతుంది!
గంటలకొలదీ మీకు హాయిగొలిపే ప్రత్యేక పరిమళంగల రెక్సోనా సౌందర్యకారియైన నిత్యస్నానానికి దివ్యమైనది.
Rexona
GOOD FOR YOUR SKIN
కొత్త కాగితపు మూత, కొత్త ఆకారం, కొత్త ఆకుపచ్చ రంగుతో నున్న కొత్త రెక్సోనా మీకు ప్రీతైనది!
కొత్త రెక్సోనా — మీ చర్మానికి గుణకారి
ఆస్ట్రేలియాలోని రెక్సోనా ప్రొప్రయిటరీ లి., తరఫున...హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్ చేత భారతదేశంలో తయారు చేయబడినది.
RP.170-X52 TL

# చిన్న కొడుకు

పెద్దవారికి 'మా పెద్దమ్మాయి' అని నన్ను చూపారు. నేను ఎందుకో అనుకొన్నా. తర్వాత నాన్నగారు ఏదో వూరువెళ్ళి సాయంత్రం వచ్చారు. వస్తూనే నన్ను చూసి 'అదృష్టవంతు రాలవు తల్లీ, నీ పెళ్ళి నిశ్చయమయింది. ఇంక రెండు వారాలే ఉందమ్మా ముహూర్తం'' అని అన్నారు.

నేను తెల్లబోయాను. మాట్లాడలేక పోయాను. 'నాకు తెలుసు తల్లీ! నా మాట కాదనవు. ఎంత మంచివాడు తల్లీ—అబ్బాయి! అతని తల్లో—నిజంగా మనం అదృష్టవంతు లం. ఒక్క రాగి డబ్బు కట్నం లేకుండా పెళ్ళికి ఒప్పుకున్నారంటే—చూడు తల్లీ—ఎంత సంస్కారవంతులో—స్వంత వూరిలోనే ప్రాక్టీస్ పెట్టాడు' అంటూ ఆయన కుర్చీలో కూర్చుని చెప్పుకుపోతున్నారు సావిత్రీ. నేను వినలేకపోయా.

''నాన్నా! నాకీ పెళ్ళి వద్దు నాన్నా'' అని ఎట్లాగో చెప్పా. సావిత్రీ, నేను ఇప్పటివరకు మా నాన్న మాట కాదనలేదు. అంత ధైర్యం కూడా మా కెవ్వరికీ లేదు. ఆయన ఆశ్చర్య పోయి నాకేసి చూసి ''ఏమిటి—కృష్ణా! ఏమంటున్నావ్? నీకీ పెళ్ళి వద్దా? ఇంత కన్న మంచి సంబంధం నేను తేగలనా?'' అంటూ గబగబా సంచిలో వెదికి ఓ ఫోటో తీసి నా ముందుంచి 'చూడు—ఇతనిలో ఏ లోపముందో చెప్పూ' అన్నారు గట్టిగా.

• • •

నేను ఏడుస్తూన్నట్లు రాధ నాన్నతో చెప్పింది. నాన్న నావద్దకు వచ్చి నా తల నిమురుతూ ''అమ్మా! మీ అమ్మ చనిపోయిన దగ్గరనుంచీ మిమ్మల్ని పూవులలోపెట్టి పెంచాను. ఇప్పుడు నీ గొంతుక కోస్తానా? నా మాట విను తల్లీ. ఇంతకన్న మంచి సంబంధం నీ తండ్రి తేలేడమ్మా. నన్ను నలుగురిలో తలెత్తుకొని తిరగనియ్యి తల్లీ, ఈ ముసలికాలంలో' అంటూ కన్నీళ్ళు పెట్టు కొని ఆయన గదిలోకి పోయారు.

సావిత్రీ! ఇప్పుడు నేనేం చెయ్యాలి? నా కేం తోచడంలేదు. నేను ఈ నరకం భరించ లేను, సావిత్రీ భరించలేను. నే నీ ఇద్దరి మధ్యా నలిగిపోతున్నాను. నాన్నకు మా విష యం చెప్పలేదు. ఎట్లా చెప్పను? నాకు తల్లి లేదు. ఆమే ఉంటే నన్ను తన హృదయంలో దాచుకునేది. నాన్నతో చెప్పలేకపోతున్నాను. మీ నాన్నగారిని మీ అన్నయ్యను నీవు వెంటనే తీసుకొనిరావాలి. ఇక్కడ పెళ్ళి ప్రయ త్నాలు జోరుగా సాగుతున్నాయి. మీ కొరకు ఎదురు చూస్తున్నా. మీ అన్నయ్యకూ ఉత్తరం వ్రాశాను.

ఇట్లు,
కృష్ణ.

సావిత్రికి ఇప్పుడేం చెయ్యాలో తెలియ లేదు. రవిబాబు రెండురోజుల క్రితమే క్యాంప్‌కు పోయాడు. ఎప్పుడు వస్తాడో తెలి యదు. ఇక మూర్తిగారు [illegible] జరగ బోతున్న డాక్టర్ల సమావేశానికి బయలుదేరి వెళ్ళారు. తనే సాధ్యమైనంతవరకు ప్రయ త్నం చేయాలని నిర్ణయించుకుంది.

• • •

''అవునండి! వాళ్ళు ఎన్నో ఆశలు పెట్టు కొన్నారు. వాళ్ళ హృదయాలు ఎంత బాధ పడతాయో చూడండి'' అంది సావిత్రి ఆశగా సుందరరామయ్యగారికేసి చూస్తూ.

ఆయన కుర్చీలో జారబడి కూర్చున్నాడు. కృష్ణ గదిలోనుండి వెక్కి వెక్కి ఏడు స్తున్నట్లు శబ్దం లీలగా వినిపించుతూంది వాళ్ళకు. వాకిట్లో పనివాళ్ళు పందిరిరాటలు పాతడానికి గొయ్యిలు తవ్వుతున్నారు.

సావిత్రి మళ్ళీ అంది: ''మీరు బాగా ఆలోచించండి. పసి హృదయాలు. ఎంత బాధ పడతాయో మీకు బాగా తెలుసు—మా రవి అన్నయ్య మంచివాడు. మంచి ఉద్యోగంలో ఉన్నాడు. వాళ్ళు............''

సావిత్రి మాటలకు అడ్డువచ్చి సుందర రామయ్య ''చూడమ్మా, సావిత్రీ ఈ ఫోటో! —ఎవడికో ఇచ్చి నా కూతురి గొంతుక కోస్తానా, అమ్మా?—ఈ చేతులతో పెంచాను దాన్ని. అయినా, ఇంకా పెద్దవాణ్ణి ఉన్నా నన్ను సంగతి గుర్తుంచుకోవద్దా? అప్పుడే స్వతంత్రురాలయిందా?—'' అన్నాడు కొంచెం కోపంగా.

''లేదండీ. ఈ విషయం మీతోటే, మా నాన్నగారితోటే చెప్పి మీ పెద్దల అనుమతి పొందుదా మనుకున్నారు. కానీ—ఇంతలో ఈ అవాంతరం వచ్చిపడింది.''

''అమ్మాయి—సావిత్రీ! పరిస్థితులు చూచా వుగా? పనులు ఎంత జోరుగా జరుగు తున్నాయో. అందరికీ శుభలేఖలు వెళ్ళి పోయాయి. అవతలవాళ్ళు పెళ్ళికి సిద్ధపడు తున్నారు. నా చేతులలోనుండి జారిపోయిం దమ్మా. ఇప్పుడు నేను చేయగలదేమీలేదు'' అన్నాడు సుందరరామయ్య దీర్ఘంగా నిట్టూర్పు విడుస్తూ.

''మీరు పెద్దవారు. మీ మాటకు ఎదురు చెప్తా ననుకోకండి. పీటలమీద పెళ్ళిళ్ళే నిలిచిపోతున్నాయ్. మనం చూస్తూ ఉన్నాంగా. ఇప్పు డేమంత మునుకొనిపోయిందండీ'' అంది సావిత్రి.

''సావిత్రీ! దయచేసి నన్ను విసిగించకు. నేను వారి కిచ్చిన మాటకు వ్యతిరేకంగా పోలేను'' అంటూ అక్కడనుండి లేచిపోయాడు ఆయన.

> ''రోడ్ సైడ్ రోమియో'':—మీ టెలిఫోన్ నంబరు చెప్పండి. ఎప్పుడయినా మాట్లాడుకోవచ్చు.
>
> ఆమె:—టెలిఫోన్ గైడ్‌లో ఉందండి.
>
> ''రో. రో'':—మీ పేరు?
>
> ఆమె:—అదీ టెలిఫోన్ గైడ్‌లోనే ఉంది.

చేయగలిగిం దేమీలేక ఒక్క నిట్టూర్పు బరువుగా విడిచి, లేచి కృష్ణవద్దకు నెమ్మదిగా వచ్చింది సావిత్రి. తలగడలో తలదూర్చి ఏడు స్తూంది కృష్ణ. రాధ ఆమెకు కొంత దూరంలో దిగులుగా కూర్చుని ఉంది. సావిత్రి కృష్ణ భుజంపై చేయి వేయగానే అంతవరకు అణచిపెట్టుకొన్న దుఃఖం ఒక్కసారిగా పెల్లుబి కింది కృష్ణకు. సావిత్రీ రాధల కళ్ళలో కూడా నీరు నిల్చింది.

సుందరరామయ్య అక్కడికి వచ్చాడు. ఒక్కసారి అక్కడ ఉన్న వాతావరణాన్ని గ్రహిం చాడు. ఆ గదిలో నిట్టూర్పులు ప్రతిధ్వని స్తున్నాయి. అతని ముఖం గంభీరంగా ఉంది.

''అమ్మాయి! కృష్ణా—నన్ను క్షమించు తల్లీ. నే నీ పెళ్ళి నిలపలేనమ్మా. నీవు ఈ పెళ్ళికి ఇష్టపడాలి. తప్పదు. నాకు నీవు ఒక మాటియ్యాలి. ఏ అఘాయిత్యం చెయ్యనని'' అని అన్నాడు కృష్ణకేసి చూస్తూ ఆయన.

కృష్ణ మాట్లాడలేదు. వెక్కి వెక్కి ఏడుస్తూంది.

''ఏం! కృష్ణా నాకు సమాధానం చెప్పవా?'' అన్నాడు కొంత బొంగురుపోయిన కంఠంతో.

సావిత్రి ఇంక వూరుకోలేకపోయింది. కొంత విసురుగా—అంది '' మీరు ఆమెను బల వంతం చేయడం న్యాయం కాదండీ'' అని.

''తల్లీ! నీ కొక నమస్కారం. నన్ను వేధించకు'' అని కూతురుకేసి చూసి—''సరే కృష్ణా! నీ కిష్టమైనట్లు నీవు చేసుకో—నేను ఇంక నలుగురిలో తలెత్తుకొని తిరగలేను. నా దారిని నేను పోతా.'' ''రా—అమ్మాయీ—రాధికా! మనకూ ఈ ఇంటికీ ఇంతటితో ఋణం తీరిపోయింది. మనం పోదాము రా తల్లీ'' అంటూ రాధ చేయి పట్టుకొని గది బయటకొచ్చాడు.

సావిత్రి శిలాప్రతిమ అయిపోయింది. కృష్ణ చివాలున లేచి తండ్రి కాళ్లమీదపడి ''నాన్నా! నన్ను విడిచిపోకు నాన్నా. నన్ను అనాథను చెయ్యకు. నీమాట వింటా. ఏం చెయ్యమంటే అది చేస్తా'' అంటూ తండ్రి పాదాల్ని కన్నీటితో కడిగివేసింది.

సావిత్రి ఈ దృశ్యం చూస్తూ అట్టే నిల్చుండి పోయింది. వాకిట్లో పనివాళ్ళ

# చిన్న కొడుకు

వాళ్లకేమీ పట్టనట్లు ప్రక్కకు వాలి ఉన్న పందిరి రాటల ప్రక్క కంకర రాళ్లు వేసి గునపంతో కూరి, రాటలను నిటారుగా నిల పెడుతున్నారు. ప్రక్కనే సావిట్లో తిరగళ్ళు విసురుగా తిరుగుతున్నాయ్. ఆ రాళ్ల మధ్య నలిగి పిండై పోతున్న గింజల ఘోష వాటికొక లెక్కా !

• • •

సావిత్రి కిటికీ దగ్గర నిలబడి తోటలోకి చూస్తూంది. రాత్రంతా వర్షం పడిందేమో మొక్కలు ఉల్లాసంగా గాలిలో వూగులాడు తున్నాయ్. ఆకులపై ఉన్న నీటి బిందువులు మిల మిలా మెరుస్తున్నాయ్. అప్పన్న రాత్రి గాలికి పడిపోయిన 'ఏరియల్' గడక్రలను సరిచేస్తున్నాడు. సావిత్రి చూస్తూ నిల్చుంది. వెనుక అడుగుల చప్పుడు విని తను సర్దుకొని వెనక్కు తిరిగింది.

ఎదురుగా నవ్వుతూ రవి నిల్చున్నాడు. ఆమె కళ్లలో నీరు నిల్చింది.

రవి ఆశ్చర్య పోయాడు. దగ్గరికి వచ్చి "ఏం—సావిత్రీ! ఏం— జరిగింది? ఇంట్లో ఎవ్వరూ లేరు. అమ్మా, నాన్నగారూ ఎక్కడకు వెళ్లారు—?" అన్నాడు.

"నాన్నగారు ఇప్పుడే వెళ్లారు—అమ్మ వాళ్ల వూరు వెళ్లింది నిన్న " అంది కొంత తమాయించుకొని.

"మరి" అన్నాడు ఆశ్చర్యంతో కనుబొమలు ముడిచిపెట్టి.

"ఏం—లేదు రవిబాబూ—ఎక్కడికిపోయావు ఇంతకాలం" అంది.

"అవును—నాపై ఆమెకు బాగా కోపం వచ్చి ఉంటుంది. వారం రోజులు క్యాంపు రెండు వారాలై వూరుకుంది. ఏం—చెయ్యను ? చూడు సావిత్రీ, కృష్ణ మళ్లీ ఉత్తరం వ్రాయ లేదు. ఆఫీస్‌లో చూశా! ఒక్క ఉత్తరంకూడా నాకు లేదు—నీకన్నా వ్రాసిందా?"

"మీ గదిలో చూశారా—?"

"ఇంకా పోలే. ఓ—బహుశా—ఇంటి అడ్రస్‌కు వ్రాసి ఉంటుంది" అని— "ఆ సరేగాని—మీరు పాస్ అయినందుకు కంగ్రాచ్యులేషన్సు" అంటూ చిన్న అందమైన ప్లాస్టిక్ పెట్టె తెరిచి "సావిత్రీ! మీరు ప్యాస్ అయినందుకు నా ప్రెజెంట్సు మీ కిద్దరికీ" అని ముత్యాలు పొదిగిన రెండు చిన్న ఉంగరాలు బల్లపై పెట్టాడు.

సావిత్రి బలవంతంగా దుఃఖం ఆపుకుంటూంది. రవికి కనపడకుండా ముఖం దాచుకొన్నది ఉంగరాలను చూస్తున్నట్లు నటిస్తూ.

"సావిత్రీ! మీ నాన్నగారు వెళ్లారా కృష్ణా వాళ్లఇంటికి ? ఏమైంది? పెళ్లి తేదీ నిర్ణయించారా?" అన్నాడు రవి కుతూహలంతో.

సావిత్రి మాట్లాడ లేదు. కృష్ణకు పెళ్లి అయిపోయిందని ఎట్లా చెప్పాలో తెలియటం లేదు. రవికేసి అదోలా చూసింది.

రవి ఊహించింది వేరు—"మీరు లేందే ఎట్లా వెళ్లటం? మీరు వచ్చారు కనుక ఇంక వాళ్ల యింటికి వెళ్లడం తరువాయి" అని జవాబిస్తుందని అనుకొన్నాడు.

కానీ సావిత్రి నుండి అటువంటి జవాబు రాలేదు.

"ఏం సావిత్రీ! అలా ఉన్నావ్" అన్నాడు రవి.

సావిత్రి రవికేసి బరువుగా చూసి అంది "రవిబాబూ! మీరు నాకొక మాటియ్యాలి—ప్రమాణం సుమా " అని.

"తప్పకుండా."

"మీరు ఏ అఘాయిత్యం చెయ్యనని నాకు ముందు మాటియ్యాలి" అంది రవి కళ్లల్లోకి చూస్తూ. రవి ఆలోచించాడు. అన్నాడు తర్వాత "కృష్ణ క్షేమమా?" అని.

"ఆ."


"మరి ?"

"ముందు నాకు మాటియ్యాలి."

"సరే ప్రమాణం చేస్తున్నా చెప్పు చప్పున" అన్నాడు రవి.

"కృష్ణకు పెళ్లి అయిపోయింది రవి బాబూ" అని చటుక్కున చెప్పి మొహం దాచుకుంది—రవిని చూడలేక. పై డాబా అంతా ఒక్కసారిగా తనపై కూలిపోయినట్లు తల పట్టుకుని తూలి ప్రక్కనున్న టేబుల్ పట్టుకొని కుర్చీలో ఒక్క వ్రేటులో తెగ వేసిన అరటి చెట్టులా కూలబడి పోయాడు రవి.

సావిత్రి నెమ్మదిగా కళ్లు విప్పి చూసింది.



రవి టేబుల్‌పై తలపెట్టి అక్కడ ఉన్న కృష్ణ ఫోటోకేసి చూస్తున్నాడు. అతనికండ్ల నుండి సన్నగా నీరు కారుతూంది.

సావిత్రి నెమ్మదిగా చెప్పుతూంది: "కృష్ణ ఎంతగానో మొత్తుకుంది. నేనూ చెప్పా! కానీ వాళ్ల నాన్నగారు మా మాట వినలేదు. సమయానికి మీరు లేరు—నాన్నగారు లేరు. చివరికి విషమ పరిస్థితి తట్టుకోలేక కృష్ణ పెళ్లికి ఒప్పుకుంది."

"నీవూ ఉన్నావా సావిత్రీ అక్కడ ? ఇంత అన్యాయం జరుగుతుంటే ఊరుకున్నావా సావిత్రీ"— రెండు చేతులతో ముఖాన్ని కప్పుకొని అన్నాడు దుఃఖంతో రవి.

"లేదు రవిబాబూ! నా శాయశక్తులా ప్రయత్నించా. కానీ లాభం లేకపోయింది. పరువు, ప్రతిష్ఠ కొరకు ఆయన ఒప్పుకో లేదు." అంటూ డ్రాయర్ లాగి కృష్ణ వ్రాసిన ఉత్తరాన్ని రవికిచ్చింది సావిత్రి.

వణుకుతున్న చేతులతో అందుకొన్నాడు. చదివి "ఎంత దురదృష్టవంతుణ్ణి సావిత్రీ! ఆమెను దక్కించుకో లేకపోయాను. జారి పోయింది" అంటూ లేచి తూలుతూ గది విడిచాడు. భయంకర వాతావరణంతో నిండి ఉన్న గది అతన్ని నిరోధించ లేకపోయింది. చూస్తూ వూరుకుంది, అతన్ని వారించే శక్తి లేక.

కన్నీటితో తడిసిపోయిన ఉత్తరం బల్లపై గాలికి ఇటూ అటూ కదులుతూంది.

• • •

కృష్ణ పుస్తకం చదువుతూంటే వీధిలోంచి "అమ్మగారూ" అని ఎవరో పిల్చారు. పుస్తకాన్ని బల్లపై పెట్టి వీధి తలుపు తీసింది.

ఎదురుగా పోస్టుమన్ రెండు కవర్లు పట్టుకొని నించున్నాడు. కృష్ణ వాటిని అందుకుంది. ఒకటి తనకు. రెండోది అత్తగారు సుభద్రమ్మకు. అడ్రస్ ఎవరు వ్రాశారో గుర్తు పట్టింది కృష్ణ. సావిత్రి వ్రాసింది. అత్తయ్యకు ఎందుకు వ్రాసింది సావిత్రి? ఆమె ఆలోచనకు అంతు దొరకలేదు. ఉత్తరాన్ని అత్తయ్యకు ఇద్దామని ఇంట్లోకి పోబోయింది. పనిమనిషి ఎదురు వస్తూంది.

"సూరమ్మా! అమ్మగారికి ఈ ఉత్తరాన్ని ఇయ్యవే" అంటూ ఆ కవరు మీది అడ్రస్ చదివింది. "గోరింట సుభద్రమ్మ, కోవెల వీధి, రామాపురం" అని ఉంది.

"అమ్మగారు ఇంట్లో లేరమ్మా. జానకమ్మగారింటికి వెళ్లారు" అంది సూరమ్మ.

"సర్లే! వచ్చాక ఇస్తా" అంటూ తన గదిలోకి పోయి కుర్చీలో కూర్చుని కవర్ని చించి ఉత్తరాన్ని పైకి తీసింది.

"కృష్ణా!

నీకు మళ్లీ ఇంతకాలానికి వ్రాస్తున్నాను. మానవజీవితంలో సహింపరానివి నిర్దయగా వారు కోరుకొనకుండా మీద పడుతూ ఉంటాయి. సుఖాలు కోరుకున్నా రావు. అదేమిటో ఎంత ఆలోచించినా గోచరించదు. నీకు ఈ ఉత్తరాన్ని వ్రాసి గాయపడిన నీ హృదయాన్ని మళ్లీ రేపుతున్నానని బాధ పడకు. ఒక వ్యక్తి మరణశయ్యపై ఉన్నపుడు తోడి మానవులు రెండు కన్నీటి బిందువులు రాలుస్తారు.

నీ పెళ్లి అయిన సరిగా ఒక వారం తర్వాత రవిబాబు క్యాంప్‌నుండి సరాసరి మాయింటికి వచ్చాడు. రావడం తడవుగా మనిద్దరం ప్యాస్ అయినందుకు బహుమతిగా రెండు ఉంగరాలు తెచ్చాడు. వాటిని చూస్తే నాకు నిజంగా చెప్పలేనంత దుఃఖం పొంగివచ్చింది. నిన్నుగురించి అడిగాడు. తనపై ఎంత కోపం పెట్టుకుందని నన్ను గుచ్చి గుచ్చి అడిగాడు. అంత కుతూహలంతో నిన్ను గురించి అడుగుతున్న రవికి ఈ ఘోరవార్త ఎట్లా చెప్పను?



**వలపు తలపులు** చిత్రం—వీరిశెట్టి అచ్యుతరావు (పుల్లేటి కుర్రు)

నీవు పెండ్లి పీటలపై కూర్చోబోయే ముందు నేను నిన్ను అడిగాను—"కృష్ణా, రవికేం సమాధానం చెప్పనని?" నీవు అన్నావు "చచ్చిపోయిందని." నీవు అంత సులభంగా చెప్పగలవేమో గానీ—నేను రవితో ఎట్లా చెప్పగలను? నేను చెప్పాను. "రవిబాబూ! మీరు ఏ అఘాయిత్యం చెయ్యనంటే ఒక సంగతి చెప్పుతాను" అని. 'తప్పకుండా' అంటూ ప్రమాణం చేశాడు. అణిచిపెట్టుకున్న ఈ ఘోరవార్త నా హృదయాన్ని, నోటిని చించుకొని బయటకు వచ్చింది. అతని బాధను చూడలేక రెండు చేతులతో కళ్లు గట్టిగా మూసుకొన్నా. అతని హృదయంలో చెలరేగిన ఆ పెనుతుపానుకు అతడు తట్టుకోలేకపోయాడు. అతడు విడిచిన నిట్టూర్పులు ఇంకా నా చెవులలో ప్రతిధ్వనిస్తున్నాయి. మా ఇంటివద్ద జరిగిన విషయం చెప్పా. నీవు వ్రాసిన ఉత్తరం అతని కిచ్చా. తల బాదుకొన్నాడు. భయంకర

## హోం సినిమా ప్రొజెక్టర్

రు. 15/—



**ఇంటివద్ద అద్భుతమైన వినోదము**

మీ స్వంత యింట్లో మా ప్రొజెక్టరుతో సినిమాలోని సాహస కృత్యములు, ప్రేమకలాపాలు మొదలైనవి చూచి ఆనందించండి. టార్చిలైటు గాని ఏసి డిసి ఎలెక్ట్రిసిటీగాని వాడవచ్చును. ఫిలిం 35 ఎం. ఎం. బొమ్మలు స్క్రీన్ మీద కదులుతూ నాట్యం చేస్తూ వినోదం కలిగిస్తాయి. ధర రు. 15లు. 40అ.ఫిలిం మరియు 4'X3' సైజ్ స్క్రీను.ఫిలించూపించేవిధంఉచితం.పోస్టేజి రు. 4—50 న. పై. అదనం డీలక్సు స్పెషల్ ప్రొజెక్టరు ధర రు. 25 లు 60 అ. ఫిలిం 4'X3' సైజ్ స్క్రీను. ఫిలిం చూపించేవిధం ఉచితం. పోస్టేజ్ రూ. 5/— అదనం. గిరాకీ విశేషంగాఉంది. నేడే ఆర్డరు పంపండి.

**HOLLYWOOD CINEMA CORP. (Regd.),**
**2194, Kalyanpura Turkman Gate, (7)**
**DELHI-6.**


# చిన్న కొడుకు

వాతావరణంతో నిండిపోయిన ఆ గదిలో అతను నిలువలేకపోయాడు. వెళ్లిపోయాడు. అతన్ని వారించే శక్తి నాలో లేకపోయింది.

నాన్నగారు ఇంటికి వచ్చినతరువాత చెప్పా రవి విషయం. ఆయన భయపడ్డారు. ఆయన వెంటనే కారులో బయలుదేరారు. కానీ ఆయన కనబడలేదనుకొంటూ. దిగులుగా వస్తున్న నాన్నగారు నన్ను చూచి "కనిపించ లేదమ్మా—వాళ్ల ఆఫీసుకు వెళ్లా—అక్కడా లేడు" అన్నారు బాధతో. అమ్మ ఎంతగానో విచారించింది. ఇంకా బాధపడుతూంది. అతనిని తలచుకోని రోజుండేది కాదు.

ఓ రోజున నేను కాలేజీకి బయలుదేరుతుంటే నాన్నగారు ఫోన్ చేశారు—రవి కన్పించాడని, డిస్పెన్సరీకి వెంటనే రమ్మని. కారు ప్రమాదం వల్ల గాయపడ్డాడట. అమ్మతోనన్నా చెప్పకుండా పరుగెత్తా. నర్సు చెప్పింది ఆపరేషన్ చేస్తున్నారని. గది బయట దిగులుగా కూర్చున్నా. ఒక గంట అయింది. తలుపులు తెరచుకొన్నాయ్. నేను లోనికి వెళ్లబోయా. నాన్నగారు ఎదురు వచ్చారు.

'అమ్మా! సావిత్రీ!' అంటూ నన్ను కొంత దూరం తీసుకొనివెళ్లి 'చాలా గట్టి గాయాలు తగిలాయి. చాలా రక్తం పోయింది. రక్తం ఎక్కించాం. డాక్టర్ హరిగార్ని కూడా రమ్మన్నాను. ఎడమచేయి విరిగిపోయింది. దానికి ఫర్వాలేదు. కానీ! ఎడమ ప్రక్క ఎముకలు విరిగి వూపిరితిత్తుల్లో గుచ్చుకొన్నాయ్' అన్నారు ఆయన నొసటపై చెమటను తుడుచుకుంటూ.

నాకు అక్కడ నించో బుద్ధివేయలా. "నాన్నా! నేను లోనికి వెళ్లవచ్చా" అన్నా.

'వెళ్లు సావిత్రీ. కానీ, బహుశా రేపటి వరకూ స్పృహలోకి రాడు" అంటూ ఆయన బరువుగా అడుగులు వేస్తూ గదిలోకి పోయారు.

'నేను లోనికి వెళ్తుంటే డాక్టర్ హరి గారు వస్తున్నారు. నేను ఒక్క పరుగులో వెళ్లా. నిర్జీవంగా పడుకొనిఉన్న రవిబాబును చూసి నా దుఃఖం పొంగింది. ఒక్కసారిగా గట్టిగా ఏడ్చివేశా. వెనుక నాన్నగారు వచ్చి 'సావిత్రీ! బేలవైతే ఎట్లా. మనం శాయ శక్తులా ప్రయత్నం చేస్తాం. తర్వాత మన అదృష్టం సావిత్రీ' అని అన్నారు నాకు ధైర్యం చెప్పుతూ.

రెండురోజులవరకు సరిగా రవిబాబుకు తెలివి రాలేదు కృష్ణా మూడవరోజున నెమ్మదిగా కండ్లు విప్పాడు. "రవిబాబూ" అన్నా. మాట్లాడలేదు. పాపం బాధవల్ల గట్టిగా మూలిగాడు. నావైపు చూసి కన్నీళ్లు పెట్టుకొని కళ్లు మూసుకొన్నాడు. కానీ అతని హృదయంలోంచి వస్తున్న బాధమాత్రం నా చెవులకు స్పష్టంగా వినిపించుతూంది.

నేను నెమ్మదిగా అన్నాను: "రవిబాబూ, అయిం దేదో అయింది. మీరు మాకు దక్కారు. అమ్మ ఎంతగానో విచారిస్తూంది. ఇప్పటివరకు అమ్మ ఇక్కడే ఉండి ఇప్పుడే వెళ్లింది ఇంటికి..... రవిబాబూ ! ఒక్కటి అడుగుతాను చెప్పుతారా?"

నర్సువచ్చి నన్ను వారించింది మాట్లాడవద్దని. ఇంతలో నాన్నగారు వచ్చి ఇన్‌జక్షన్ ఇచ్చి ధైర్యం చెప్పి వెళ్లారు.

రెండు మూడు రోజులు బాగానే ఉంది. నేను మందు గ్లాస్ కడుగుతుంటే రవి నన్ను పిలిచాడు. నేను దగ్గరకు వెళ్లా.

"సావిత్రీ—నేనెవరికొరకు బ్రతకాలని చెప్పూ. జీవించడం కంటే చావడం ఉత్తమం కాదా—" అన్నాడు ముఖం ప్రక్కకు త్రిప్పుకుంటూ.

'ఎన్నిసార్లు చెప్పాలి రవిబాబూ మీకు. ఒక్క కృష్ణ తప్ప మీకు ఈలోకంలో మరెవ్వరూ లేరా—?—మీ బంధువులు. మానాన్నగారు, సొంతకొడుకులా చూచుకొన్న మా అమ్మ లేదా—వీళ్లకన్న ఎక్కువా ఆమె—' అన్నాను.

'నీకు తెలీదు—సావిత్రీ. నీకు తెలీదు'

'అవును రవిబాబూ నాకు బాగా తెలుసు. ఆమెగారు చక్కగా భర్తతో కాపురం చేసుకుంటూంది. కానీ, మీరు మాత్రం ఇంకా


కష్టమే ఫలిస్తుంది! సత్యమే జయిస్తుంది!!

## రవి ట్యుటోరియల్ కాలేజి

| బాలికాశాఖ | బాలురశాఖ |
| --- | --- |
| 2 వ లైను | 3 వ లైను |

**బ్రాడీపేట — గుంటూరు - 2.**

లో చేరి విజయం పొందండి, ఎందరో ఫస్ట్ సెకండ్ క్లాసులలో ప్యాసయినారు. 4,5 ఫారములుతప్పినవారుకూడ మెట్రిక్‌చదవవచ్చు. భోజనవసతులుగల 3 హాస్టల్సు, 32 మంది అధ్యాపకులు, మంచి లేబరేటరీగలిగి మీ ఆదరాభిమానములు చూరగొన్న విద్యా సంస్థ.

మా విద్యార్థులే మీకు సాక్ష్యం. మీ సేవే మా లక్ష్యం.

వివరాలకు: సి. వి. ఎన్. ధన్ ఎం.ఎ., ప్రిన్సిపాల్.



'బోసినవ్వు'

ఫోటో—ఎన్. రామకృష్ణ (మాయురమ్)

ఆమెను స్మరిస్తూ బాధపడుతున్నారని నాకు బాగా తెలుసు' అన్నా. రవిబాబు మాట్లాడలేదు. ఒక్క దీర్ఘమైన నిట్టూర్పు విడిచాడు. 'రవిబాబూ—ఇలాంటి విషయాల్లో మనస్సు రాయిచేసుకోవాలి' అన్నా దుప్పటికప్పుతూ.

కృష్ణా! రవిని బ్రతికించుకొన్నామనుకొన్నాం. ఈ రెండు వారాలలో కొంత కోలుకొన్నాడు. ఒకనాటి రాత్రి సరిగా రెండు గంటలకు రవి గుండెల్లో నొప్పి వచ్చింది. విపరీతమైన నొప్పితో బాధ పడ్డాడు. వెంటనే ఇంటికి ఫోనుచేశా. వెంటనే నాన్నగారు వచ్చారు. ఎంతో ప్రయాసపడితేనేగాని నొప్పి తగ్గలేదు. ప్రొద్దుట రవిబాబు నన్ను పిలిచాడు. నేను దగ్గరకు వెళ్ళా.

'సావిత్రీ! నేనెంతో కాలం బ్రతకను. నాకొక కోరిక ఉంది. సహాయం చేస్తావా?' అన్నాడు జాలిగా.

'ఏం మాటలు—అవి—రవిబాబూ? నా ప్రాణం పోసి మిమ్మల్ని బ్రతికించుకుంటా?' అన్నా ధైర్యం చెప్పుదామని.

'సావిత్రీ, నిజం నేను అట్టే కాలం బ్రతకను. నన్ను మా ఊరు తీసుకొని వెడతావా?—మా అమ్మను చూడాలని ఉంది. కడసారిగా చూడాలని ఉంది సావిత్రీ—నన్ను మా ఊరు తీసుకొని వెడతావా?—'

'ఈ స్థితిలో మిమ్మల్నిఎట్లా తీసుకొని వెళ్లను రవిబాబూ? మీ ఇంటి అడ్రస్ చెప్పండి—ఇంటికి వ్రాస్తా?' అన్నా.

ఎంతో బలవంతంమీద చెప్పాడు. ఆమెది మీ వూరే. ఆమెకు ఉత్తరం వ్రాస్తున్నాను. నిన్ను రమ్మని ఎట్లా వ్రాయగలను. రవి జీవితం ఏమవుతుందో తెలియదు. ఇవన్నీ వ్రాసి మళ్ళీ నీ హృదయాన్ని గాయపరిచానని మాత్రం తలచవద్దు. స్వార్థపరురాలని నిందించవద్దు."

చదవలేక చదివింది కృష్ణ. 'తను చేసిన ఈ దుష్కృతికి నిష్కృతి ఉందా? అనుకొంది. ఊరికే పిచ్చిదానిలా శూన్యం లోకి చూస్తూంది. ఆశూన్యంలో తనూ, రవీ, సావిత్రీ తిరిగిన ప్రదేశాలూ, తమ నవ్వులు, గడిపిన వెన్నెల రాత్రులు—ఒక్కొక్కటి ఆమె కండ్లముందు కన్పించాయి. ఆమె అక్కడ ఉండలేక తన మంచంమీద పడిపోయి దుఃఖాన్ని ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్చి వేసింది.

'అమ్మాయీ, కృష్ణా—ఉత్తరం వచ్చిందటగ" అంటూ సుభద్రమ్మ గదిలోకి వస్తూంది. కృష్ణ గభాలున లేచి కన్నీళ్ళు తుడుచుకొని ఉత్తరాన్ని అత్తగారికి ఇచ్చింది. అందులో ఉన్నది ఇది:

'శ్రీమతి సుభద్రమ్మగారికి,

మీ అబ్బాయి రవిబాబు రెండు వారాల క్రితం కారు ప్రమాదంవల్ల గాయపడ్డాడు. మిమ్మల్ని చూడాలని ఎంతో ఆశగా ఉన్నాడు. మీరు వెంటనే రావాలి. మీకొరకు ఎదురు చూస్తున్నాం. 'డాక్టర్ వాసుమూర్తిగారి డిస్పెన్సరీ' అంటే ఎవరన్నాచెప్పుతారు. మీరు వెంటనే రావాలి.

ఇట్లు,

సావిత్రి.,

అంతే సుభద్రమ్మ గొల్లుమంది.

• • •

రిక్షా దిగివస్తున్న వారి కెదురుగా సావిత్రి వెళ్లింది. కృష్ణను చూసి గబగబా ముందుకు వచ్చి "కృష్ణా! రవి చనిపోయాడు కృష్ణా" అంటూ బావురుమంది కృష్ణను కావలించుకొని. సుభద్రమ్మ తలబాదుకొంటూ లోనికి పరుగెత్తింది. ఆమె పెద్దకొడుకు రఘు దిగులు పడి నిల్చుండి పోయాడు. ★